


● జర్మన్, ఇంగ్లండ్ పర్యటన సక్సెస్

విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



స్టాలిన్‌కు స్వాగతం పలుకుతున్న ఆయన సోదరి, ఎంపీ కనిమొళి

# రాష్ట్రానికి విదేశీ పరిశ్రమలు

● త్వరలో హోసూరులో పెట్టుబడిదారుల సదస్సు ● సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'టీఎన్ రైజింగ్' పేరుతో విదేశీ పెట్టుబడులను సమీకరించేందుకు వారం రోజులపాటు జర్మన్, ఇంగ్లడులో చేసిన విదేశీ పర్యటన విజయవంతమైందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితోనే హోసూరులో త్వరలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. తన విదేశీ పర్యటనతో రాష్ట్రంలో పది కొత్త పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, రూ.15,516 కోట్ల మేర పెట్టుబడులు సమీకరించామని, 17,613 మందికి ఉపాధి లభింస్తుందని తెలిపారు. స్టాలిన్ విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం ఉదయం నగరానికి తిరిగొచ్చారు. విమానాశ్రయం వద్ద రాష్ట్రమంత్రులు, డీఎంకే సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు. స్టాలిన్ స్వదేశాగమనం సందర్భంగా నగరమంతటా ఆయనకు స్వాగతం పలుకుతూ పోస్టర్లు అతికించారు. విమానాశ్రయం వద్ద మీడియా సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో తాను జరిపిన విదేశీ పర్యటనలన్నీ విజయవంతమయ్యాయని, అన్నింటికంటే తాజాగా జర్మన్, బ్రిటన్ దేశాల పర్యటనలో విదేశీ పెట్టుబడులను భారీగా సమీకరించగలిగామని, త్వరలో పది విదేశీ సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నాయని చెప్పారు. తన పర్యటనలో భాగంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ద్రవిడ ఉద్యమనేత పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరించడం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. అంతే కాకుండా రెండు దేశాల్లో నివసిస్తున్న ప్రవాస తమిళులు, పారిశ్రామికవేత్తలు తనకు సాదరంగా స్వాగతం పలికారన్నారు. తన విదేశీ పర్యటన విజయవంతంగా కావటాన్ని చూసి ఓర్వలేక కొందరు ప్రత్యర్థులు పనిగట్టుకుని పసలేని విమర్శలు చేస్తున్నారని, విదేశీ పర్యటన ఎందుకు స్థానికంగా ఉన్న సంస్థలతో చర్చలు జరిపితే చాలంటూ ఉచిత సలహాలు చెబుతుండటం శోచనీయమన్నారు. జర్మనీలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొన్నవారంతా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కల్పిస్తున్న రాయితీలు, వసతులు గురించి వివరించినప్పుడు విస్మయం చెందారని, తమిళనాట ఇంతటి సదుపాయాలున్నాయా అంటూ ప్రశ్నించారని, భవిష్యత్తులో ఏదైనా పరిశ్రమలు స్థాపించాలనుకుంటే తమిళనాడునే ఎంపిక చేసుకుంటామని ప్రకటించారని, ఇవన్నీ రాష్ట్ర పురోగతికి తోడ్పడతాయన్నారు. ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి నా సొంతడబ్బులు విదేశాల్లో పెట్టుబడిగా పెట్టేందుకే వెళ్లారని విమర్శించడం విడ్డూరంగా ఉందని, పెరియార్ భావాలను విదేశాల్లో పెట్టుబడి పెట్టేందుకు వెళ్లానని చెప్పి ఉంటే బాగుండేదన్నారు. అన్నాడీఎంకే నేత సెంగోట్టయ్యన్‌ను ఆ పార్టీ నుండి తొలగించడంపై విలేకరులు ప్రశ్నించగా, రాష్ట్ర పురోగతి గురించి మాట్లాడుతున్నప్పుడు ఆ పార్టీ గొడవలు మనకెందుకన్నారు.

## అన్నామలైతో లోకేశ్ భేటీ



కోవైలో నారా లోకేశ్‌ను సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై - లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న టీడీపీ నగర ఇన్‌ఛార్జి చంద్రశేఖర్

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో ప్రముఖ ఆంగ్ల చానెల్ ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలైని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, విద్యారంగంలో తాము చేపడుతున్న సంస్కరణలు దేశానికి రోల్‌మాడల్‌గా నిలుస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలని అన్నామలైని లోకేశ్ ఆహ్వానించారు. ఈ భేటీ సందర్భంగా అన్నామలై ఏపీ మంత్రి లోకేశ్‌ను సత్కరించారు. అదే విధంగా లోకేశ్ కూడా అన్నామలైని సంత్కరించి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు.

### టీడీపీ నేత భేటీ...

ఇదే విధంగా కోవైలో టీడీపీ చెన్నై అధ్యక్షుడు చంద్రశేఖర్ కూడా ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమిళనాట పార్టీ ఎదుగుదలకు చేపడుతున్న చర్యలను గురించి లోకేశ్‌కు ఆయన వివరించారు. రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాల కోసం లోకేశ్ అడిగి తెలుసుకున్నారు.

● ఉప రాష్ట్రపతి ఎన్నికలు ..

## ఢిల్లీకి వెళ్ళిన రాష్ట్ర ఎంపీలు

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఉపరాష్ట్రపతి ఎన్నికలు మంగళవారం జరుగనున్నాయి. అందులో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాష్ట్రానికి చెందిన ఎంపీలు మంగళవారం ఢిల్లీ వెళ్లారు. హస్తినకు వెళ్ళిన వారిలో పి.చిదంబరం, అరుణ్ నెహ్రూ, దయానిధి మారన్, ధనపాల్, ధరణివేందన్, నవాజ్‌గనీ, కనిమొళి, ఏ.రాజా, తిరుచ్చి శివ, జగద్రక్షకన్, ఎస్.ఆర్.ఇళంగో, ఇళయరాజా, ఇన్బదురై, వెంకటేశన్ తదితరులున్నారు. అలాగే, ఇటీవల రాజ్యసభకు నామినేట్ అయిన నటుడు కమల్ హాసన్ ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నారు. ఆయన కూడా మంగళవారానికి ఢిల్లీ చేరుకుని ఉపరాష్ట్రపతి ఎన్నికలో తన ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో 210 సీట్లు పక్కా

● విజయంపై ఈపీఎస్ ధీమా



చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే నాయకత్వంలోని కూటమి 210 స్థానాలను సునాయాసంగా గెలుచుకుంటుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల డీఎంకే అవినీతి, అసమర్థ పాలనపై ప్రజలంతా విసిగిపోయారని, ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించడానికి కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. ఓ ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ జర్మన్, ఇంగ్లాండు దేశాల పర్యటన పూర్తిగా విఫలమైందని, కొత్త పరిశ్రమలకు సంబంధించి ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోలేదని, కొత్తగా పెట్టుబడులు కూడా సమీకరించలేదని, రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిశ్రమల విస్తరించేందుకు ఆయా సంస్థలు సిద్ధమవుతుండగా, వాటిని ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 52 మాసాలుగా డీఎంకే ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు, సేకరించిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని తాము ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా స్టాలిన్ పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా ప్రధాన పోటీ డీఎంకే, అన్నాడీఎంకే మధ్యేనని, ఇతర పార్టీలను గురించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయనని స్పష్టం చేశారు. అన్నాడీఎంకే అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, డీఎంకే పాలనలో రాష్ట్రంలో అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ వచ్చే ఎన్నికల్లో అన్నాడీఎంకే నాయకత్వంలోని కూటమి 210 అసెంబ్లీ స్థానాలలో విజయబావుటా ఎగురవేయడం తథ్యమని ఈపీఎస్ జోస్యం చెప్పారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



## త్వరలో ఐసీయూలోకి అన్నాడీఎంకే

● డిప్యూటీ సీఎం ఉదయనిధి ● సైదాపేటలో కొత్త ఆస్పత్రి ప్రారంభం

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లు వెళ్లే ప్రధాన రహదారులను ఆక్రమించి రోడ్‌షోలు చేస్తున్న అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే ఆ పార్టీ ఐసీయూలో చేరటం ఖాయమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జోస్యం చెప్పారు. సైదాపేటలో రూ.28.75 కోట్లతో నిర్మించిన ఆరంతస్థుల ఆస్పత్రిని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎం.సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ సీఎం స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ద్రావిడ తరహాపాలనలో విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నామని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హాయంలో వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల కారణంగానే చెన్నై నగరం దేశంలోనే వైద్య రాజధానిగా పేరుతెచ్చుకుందన్నారు. ప్రజల వద్దకే వైద్యం పథకానికి ఐక్యరాజ్యసమితి సైతం ప్రశంసాపత్రాన్ని బహూకరించిందని చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష నేత ఈపీఎస్ రాష్ట్రంలోని ప్రధాన రహదారులను ఆక్రమించి రోడ్‌షోలు చేస్తున్నారని, ఇటీవల ఓ అంబులెన్స్ ఆయన సభలకు హాజరైన జనం మధ్య వెళుతుండగా డ్రైవర్‌ను, డాక్టర్‌ను బెదరింపు ధోరణితో దుర్భాషలాడారని, ఆ సంఘటనను చూసిన ప్రజలంతా ఆయనపై ఏవగించుకున్నారన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే చిత్తుగా ఓడిపోవటం తథ్యమని, ఈపీఎస్ కూడా ఐసీయూలో చేరి చికిత్స పొందే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం రూ.30కోట్లతో మెరుగుపరచిన విరుగంబాక్కం కాలువ కూడా ఉదయనిధి ప్రారంభించారు.

## ఈపీఎస్ సీఎం అభ్యర్థి అని నేను చెప్పలేదు...!

● అన్నాడీఎంకే ఐక్యతగా ఉండాలి ● బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్



పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థి ఎడప్పాడి పళనిస్వామి అని తాను చెప్పలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. తిరునల్వేలి జిల్లా పాళయంకోటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమది జాతీయ పార్టీ అని, పార్టీ అధిష్ఠానం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఆ ప్రకారం, రాష్ట్ర పార్టీ బూత్ కమిటీ సమావేశానికి వచ్చిన కేంద్ర మంత్రి అమిత్ షా, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై అన్నాడీఎంకే నేతృత్వంలో కూటమి అని ప్రకటించారని, అలాగే, ఎన్డీఏ ముఖ్యమంత్రి అభ్యర్థి పళనిస్వామి అని అమిత్ షా ప్రకటించడంతో, పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని తాము పాటించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్డీఏ కూటమి నుంచి వైదొలిగేందుకు కారణం తానేనని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ చెప్పడం అంగీకరించలేకపోతున్నానన్నారు. ఆయన నాలో ఏ లోపాలు చూసారో అర్థం కావడం లేదన్నారు. ఈపీఎస్, ఓపీఎస్, దినకరన్ తనకు మంచి స్నేహితులని, వారిలో దినకరన్ ముఖ్యమైనవారన్నారు. గత ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమిలో ఆయన కొనసాగారని, రాబోయే శాసనసభ ఎన్నికల్లోను ఆయన కూటమిలో ఉంటారని భావించామన్నారు. అన్నాడీఎంకే నుంచి వెళ్లిన వారందరూ తిరిగి ఒక్కటి కావాలన్నదే తన అభిప్రాయమన్నారు. మా కూటమిలో ఇప్పటికే అన్నాడీఎంకే ఉందని, మళ్లీ సెంగోట్టయన్ కూటమిలోకి రావాలని కోరే అవకాశం ఉండదన్నారు. ముఖ్యమంత్రి లండన్, జర్మన్ పర్యటనల్లో ఎన్ని సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు, ఏ మేరకు పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి అనే విషయమై శ్వేతపత్రం విడుదల చేయాలని నాగేంద్రన్ డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## హస్తిన బాట పట్టిన సెంగోట్టయ్యన్

● త్వరలో బీజేపీ పెద్దలతో భేటీ?



అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ (కేఏఎస్) హస్తినబాట పట్టారు. తనను అన్నాడీఎంకే ప్రాథమిక సభ్యత్వం నుంచి తప్పించినట్టు ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఢిల్లీకి వెళ్ళి బీజేపీ పెద్దలతో సమావేశమై ప్రస్తుత పరిస్థితిపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అన్నాడీఎంకేలో ఎడప్పాడి, కేఏఎస్‌ల మధ్య మాత్రం ప్రచ్ఛన్నయుద్ధం కొన్ని నెలలుగా జరుగుతోంది. గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో ఎడప్పాడి మంత్రి వర్గంలో సెంగోట్టయ్యన్ పనిచేశారు. అయితే, గత ఫిబ్రవరిలో ఎడప్పాడికి జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరుకాలేదు. అప్పటి నుంచి ఆయన తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వ్యక్తం చేస్తుండడం అన్నాడీఎంకే అధిష్ఠానానికి ఆగ్రహం తెప్పించినప్పటికీ వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎడప్పాడి మౌనం దాల్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న మీడియా సమావేశం ఏర్పాటు చేసిన కేఏఎస్ పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చేందుకు పార్టీకి దూరమైన నేతలందరినీ మళ్ళీ కలుపుకోవాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసి, దీనికి ఎడప్పాడికి పది రోజుల గడువు విధించారు. ఇది ఎడప్పాడికి, మరికొందరు సీనియర్ నేతలకు ఆగ్రహం తెప్పించింది. ఈపీఎస్ వెంటనే రంగంలోకి దిగి సెంగోట్టయ్యన్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసినట్టు సమాచారం. అలాగే, కేఏఎస్‌కు మద్దతు తెలిపిన మరో ఎనిమిది మందిని కూడా పార్టీ పదవుల నుంచి తప్పించారు. ఇదిలావుండగా పార్టీకి దూరమైన మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం వర్గానికి చెందిన నేతలు కేఏఎస్ ఇంటికి వెళ్ళి తమ మద్దతు తెలిపారు. అంతేకాకుండా, సెంగోట్టయ్యన్ వ్యాఖ్యలతో ఆ పార్టీ మాజీ నేతలైన శశికళ, టీటీవీ దినకరన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తదితరులు ఏకీభవించారు. కాగా కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతుండగా సోమవారం ఉదయం సెంగోట్టయ్యన్ ఆకస్మికంగా ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. ఈ పర్యటనలో ఆయన బీజేపీ పెద్దలను కలుసుకుని పార్టీలోని వాస్తవ పరిస్థితిని వివరించే అవకాశం ఉన్నట్టు ఆయన సన్నిహితులు తెలిపారు. అయితే, కోవై విమానాశ్రయంలో కేఏఎస్ మీడియాతో మాట్లాడుతూ, తాను హరిద్వార్ వెళుతున్నట్టు చెప్పారు.

## రెండు రోజులు పలు జిల్లాల్లో భారీవర్షాలు

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా మంగళ, బుధవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... మంగళవారం తిరువణ్ణామలై, కళ్లకుర్చి, తేని, దిండుగల్, మదురై, శివగంగ తదితర జిల్లాలు, బుధవారం వేలూరు, రాణిపేట, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువణ్ణామలై, నీలగిరి, తేని, దిండుగల్, మదురై తదితర జిలాల్లో భారీ వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో పగటి పూట ఎండ తీవ్రత, సాయంత్రం, రాత్రి వేళల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

### నేడు డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం మంగళవారం జరుగనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో... ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ నేతృత్వంలో తేనాంపేటలోని అన్నా అరివాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం జరుగనుందన్నారు. డీఎంకే ముప్పెరుం వేడుకలు, 'ఓరనియిల్ తమిళనాడు' పేరుతో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు తదితరాలపై సమావేశంలో చర్చించనున్నట్లు, జిల్లా కార్యదర్శులు తప్పకుండా సమావేశంలో పాల్గొనాలని దురైమురుగన్ ప్రకటనలో కోరారు.

### రామనాథపురం జిల్లాలో నేటినుంచి 144 సెక్షన్

అడయార్,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో మంగళవారం నుంచి 144వ సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఇమ్మానువేల్ శేఖర్ వర్ధంతి సందర్భంగా జిల్లాలో మంగళవారం నుంచి ఈ నెల 15వ తేది వరకు 144సెక్షన్ అమలులో ఉంటుంది. అలాగే, ముత్తురామలింగ దేవర్ గురుపూజ సందర్భంగా అక్టోబరు 25నుంచి 31వ తేది వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సమాచార దృష్టి

### రెండేళ్లలో ఆరు 'టెట్' పరీక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న రెండేళ్లలో ఆరు ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఆ ప్రకారం, ఏడాదికి మూడు చొప్పున రెండేళ్లలో ఆరు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే, ఇప్పటికే పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది టెట్‌కు దరఖాస్తు స్వీకరణ ముగిసిన నేపథ్యంలో, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 10వ తేది వరకు దరఖాస్తు సమర్పణ గడువు పొడిగించినట్లు ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) ఒకప్రకటనలో తెలిపింది.

### 20 బోగీలతో ఎగ్మూర్-నెల్లై వందే భారత్

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి మధ్య 20 బోగీలతో వందే భారత్ రైలు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఎగ్మూర్-తిరునల్వేలి మధ్య 8 బోగీలతో ప్రారంభించిన వందే భారత్‌కు ప్రయాణికుల నుంచి స్పందన లభించింది. ప్రతిరోజు రిజర్వేషన్ పూర్తయి వెయిటింగ్ కొనసాగుతుండడంతో, ప్రయాణికుల కోరిక మేరకు బోగీల సంఖ్య పెంచి, 20 బోగీలతో వందే భారత్ రైలు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

### చెన్నై సెంట్రల్-షాలిమార్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-షాలిమార్- చెన్నై సెంట్రల్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.02841 షాలిమార్- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు సోమవారం సాయంత్రం 6.20 గంటలకు షాలిమార్‌లో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైలు సేవలు ఈ నెల 22 నుంచి నవంబరు 24వ తేది (10 సర్వీసులు) వరకు పొడిగించారు. మరుమార్గంలో, నెం.02842 చెన్నై సెంట్రల్-షాలిమార్ ప్రత్యేక రైలు బుధవారం వేకువజామున 4.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. ఈ రైలు 24 నుంచి నవంబరు 26వ తేది (10) సర్వీసులు పొడిగించగా, ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

### వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు డిగ్రీ తప్పనిసరి

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఇకపై డిగ్రీ తప్పనిసరి చేశారు. వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగంలో చేరేందుకు, ప్లస్ టూ ఉత్తీర్ణులైన వారు, 11 నెలల పాటు ఆ రంగంలో జీతం లేని శిక్షణ పొందాల్సి ఉంటుంది. అందులో అర్హులైన వారిని ప్రత్యక్ష నియామకం ద్వారా ఉద్యోగం కల్పించనున్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన తర్వాత, వారికి లెవల్-2 పదోన్నతి కల్పిస్తారు. ప్రస్తుతం ప్రత్యక్ష నియామకం రద్దు చేయడంతో, ఈ ఉద్యోగంలో చేరాలంటే ప్లస్ టూలో బోటనీ, జువాలజీ చదివి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. టీఎన్‌పీఎస్సీ నిర్వహించే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్టు ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

### మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతిద): కావేరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు వస్తున్న నీరు తగ్గింది. ఆదివారం ఉదయం డ్యాంకు 23,300 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, సోమవారం ఉదయం 18,800 ఘనపుటడుగులకు తగ్గింది. దీంతో, డ్యాం నుంచి డెల్టా సాగుకు విడుదల చేస్తున్న 22,500 ఘనపుటడుగుల నీటిని 18,800 ఘనపుటడుగులకు తగ్గించారు.

### 11న మంగళేశ్వరర్ ఆలయ కుంభాభిషేకం

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కంలోని మంగళేశ్వరర్ ఆలయ కుంభాభిషేకం ఈ నెల 11వ తేది జరుగనుంది. మంగళాంబికై సమేత మంగళేశ్వరర్ ఆలయ కుంభాభిషేక వేడుకల సందర్భంగా మంగళ, బుధవారాలు పలు రకాల పూజలు నిర్వహించనున్నారు. 11వ తేది నాలుగో కాల పూజలు ప్రారంభించి, ఉదయం 10.30 గంటలకు ప్రధాన ఉత్సవమూర్తి సహా అందరు స్వాములకు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. సాయం త్రం 5.30 గంటలకు వరదరాజ పెరుమాళ్ ఆలయం నుంచి తిరుకల్యాణం శారె ఊరేగింపు, రాత్రి 7 గంటలకు ఉత్సవం, 9.30 గంటలకు అమ్మవారు సమేత స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్, అన్నా సాలై, గిండి పరిధిలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ జరుగనుంది. అన్నానగర్ 11వ మెయిన్ రోడ్డు ఐదో వీధిలో ఉన్న నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, అన్నాసాలై పరిధిలో చింతాద్రిపేట లాబాండ్ వీధిలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, గిండి పరిధిలో కేకే నగర్‌లోని ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్, ఆయా ప్రాంతాల వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

### వెల్లింగ్టన్ జలాశయ పునరుద్ధరణకు రూ.130 కోట్లు

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కీలేరువై గ్రామంలోని వెల్లింగ్టన్ జలాశయ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.130 కోట్లు కేటాయించింది. కాలువ గట్ల మరమ్మతులకు రూ.74 కోట్లు, ప్రధాన కాలువ పునరుద్ధరణకు రూ.20 కోట్లు, మిగులు నీటి కాలువల మరమ్మతులకు రూ.30 కోట్లు మొత్తం రూ.130 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. 130 ఏళ్లనాటి వెల్లింగ్టన్ జలాశయాన్ని పునరుద్ధరించాలని ఆ ప్రాంత రైతుల కోరిక పరిష్కరిస్తామని సీఎం స్టాలిన్ గతంలో హామీ మేరకు వెల్లింగ్టన్ జలాశయ పునరుద్ధరణకు రూ.130 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది.

### వండలూరుకు గుజరాత్ సింహాలు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌కు సింహాలు అందజేసేందుకు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. వండలూరు పార్క్‌లో 15 ఏళ్ల క్రితం ఆసియాటిక్ సింహం అనారోగ్యం కారణంగా మృతిచెందింది. ఈ రకం సింహాలున్న గుజరాత్ నుంచి రెండు సింహాలు తీసుకురావాలని వండలూరు పార్క్ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జాతీయ జంతు మార్పిడి పథకం కింద ఒక మగ సింహం, రెండు ఆడ సింహాలు, ఒక ఆడ అడవి గాడిదను వండలూరు పార్క్‌కు తరలించనున్నారు. అందుకు, వండలూరు పార్క్ నుంచి ఒక భారతీయ గేదె, జత తెల్లపులులు, చామోయిస్ జింక, తెల్ల నెమలి, పసుపు అనకొండను గుజరాత్‌కు పంపనున్నారు.

## కన్నియాకుమారిలో అద్దాల వంతెనపై పగుళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలోని అద్దాల వంతెనపై హఠాత్తుగా పగుళ్లు ఏర్పడ్డాయి. కన్నియాకుమారి సముద్రం మధ్యలో ఉన్న వివేకానంద స్మారక మండపం, తిరువళ్లూరు విగ్రహాన్ని అనుసంధానం చేసేలా రూ.37 కోట్లతో అద్దాల వంతెన ఏర్పాటుచేశారు. ఈ వంతెనను గత డిసెంబరు 30వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ క్రమంలో, అద్దాల వంతెనపై ఓ భాగంగా సోమవారం ఉదయం హఠాత్తుగా పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో, వంతెనపై పర్యాటకులను నిషేధించిన అధికారులు, పగుళ్లు ఏర్పడిన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టారు.



పగుళ్లు ఏర్పడిన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టిన సిబ్బంది

● డీజీపీ నియామక వ్యవహారం...

## యూపీఎస్సీకి సుప్రీంకోర్టు ఆదేశం

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు డీజీపీ నియామకం విషయంలో అవసరమైన చర్యలు త్వరగా పూర్తిచేయాలని యూపీఎస్సీని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీగా వ్యవహరించిన శంకర్ జివాల్ గత నెల 31వ తేది పదవీవిరమణ చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి డీజీపీగా వెంకట్రామన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సీనియారిటీ ఆధారంగా వెంకట్రామన్ 9వ స్థానంలో ఉన్నారు. ఆయనకు ముందు 8 మంది ఐపీఎస్ అధికారులున్నారనే విమర్శలు తలెత్తాయి. ఇన్‌ఛార్జి డీజీపీగా వెంకట్రామన్ నియామకానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌లో... డీజీపీ పదవీ విరమణకు మూడు నెలల ముందుగానే కొత్త డీజీపీ పేర్లను యూపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం పంపించాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు 2015వ సంవత్సరం ప్రకాష్ సింగ్ కేసులో, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఉన్నాయని పిటిషన్‌లో తెలిపారు. కొత్త డీజీపీ పదవి నియామక ప్రక్రియ ప్రారంభమైందని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఈ పిటిషన్ సోమవారం మళ్లీ విచారణకు వచ్చింది. ఈ కేసులో అందరి తరఫు వాదనలు ముగియగా, అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల్లో... డీజీపీ నియామక చర్యలను యూపీఎస్సీ సత్వరం పరిశీలించాలి, యూపీఎస్సీ సిఫారసుల ఆధారంగా సాధారణ పద్ధతిలోనే డీజీపీ నియామకం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది.

## పీఎఫ్ కోసం ఆక్సిజన్ సిలిండర్‌తో... కలెక్టరేట్‌కు వచ్చిన రిటైర్డ్ బీడీవో



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధుడు

వేలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన గ్రీవెన్స్‌లో చిన్న సైజు ఆక్సిజన్ సిలిండెర్ అమర్చుకుని వచ్చిన మాజీ ప్రభుత్వ ఉద్యోగి పీఎఫ్ నగదును ఇప్పించాలంటూ కలెక్టర్ సుబ్బులక్ష్మిని ప్రాధేయపడ్డాడు. బీడీవోగా రిటైర్ అయి ఐదేళ్ల గడిచినా తనకు రావాల్సిన పీఎఫ్ నగదు తన ఖాతాలో జమ కాలేదని, దీనిపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదని, ఇటీవల గుండె సంబంధిత చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరానని, ఆర్థిక పరిస్థితి బాగోలేని తనను ఆదుకోవాలని కలెక్టర్‌కు వేడుకున్నారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి సత్వరం చర్యలు చేపట్టి సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారిని ఆదేశించారు.

## కలెక్టర్ గ్రీవెన్స్‌లో 415 వినతిపత్రాలు



ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన గ్రీవెన్స్ జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 415 వినతిపత్రాలు రాగా, వాటికి సంబంధించి శాఖల అధికారులను సకాలంలో స్పందించి సమస్యలను పరిష్కరింపజేయాలని ఆదేశించారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన ఓ దివ్యాంగుడికి కలెక్టర్ సుబ్బులక్ష్మి చేతుల మీదుగా వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వేలూరు తాహసీల్దార్ సెంథిల్‌కుమార్, సబ్ కలెక్టర్ కలియమూర్తి, పంచాయతీ కార్యదర్శి తిరుపాల్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ అధికారి జయచిత్ర తదితరులు పాల్గొన్నారు.

## 'కావల్ ఉదవి' యాప్‌పై అవగాహన




విద్యార్థినులతో పోలీసు అధికారులు

వేలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు బీఎమ్ డిజైన్ పాఠశాలలో సోమవారం 'కావల్ ఉదవి' పోలీస్ హెల్ప్‌లైన్ యాప్ గురించి పాఠశాల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ ముత్తుకుమార్ ఎదైనా అనుకోని సంఘటనలు, విద్యార్థినులపై దాడులు జరిగితే ఈ 'కావల్ ఉదవి' యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణమే భద్రత కల్పించేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రుక్‌జీ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ కలైసెల్వీ, ఉపాధ్యాయులు మీనా, మాలతి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ప్రాంగణంలో డీఎస్పీ అరెస్ట్

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం కోర్టు ప్రాంగణంలో యూనిఫాంతో డీఎస్పీ అరెస్ట్ కావడం కలకలం రేపింది. వాలాజాబాద్ సమీపంలోని ఓ బేకరీలో జరిగిన దాడి కేసుకు సంబంధించిన ఫిర్యాదుపై తగిన చర్యలు చేపట్టని కారణంగా డీఎస్పీ శంకర్ గణేష్‌ను ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అరెస్ట్ చేయాలని న్యాయమూర్తి సెమ్మల్ ఆదేశించారు. ఈ నెల 22వ తేది వరకు రిమాండ్‌కు తరలించాలనే ఉత్తర్వుతో, డీఎస్పీ శంకర్ గణేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

### అన్నాడీఎంకే ఆధ్వర్యంలో అన్నాదురై జయంతి వేడుకలు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో అన్నాదురై 117వ జయంతి వేడుకలు ఈ నెల 15 నుంచి 17వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ నిర్వహణ పరంగా ఏర్పాటుచేసిన 82 జిల్లాలు, పుదుచ్చేరి, ఆంధ్ర తదితర ఇతర రాష్ట్రాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని, పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ఈ నెల 15న దక్షిణ చెన్నై ఉత్తర మరియు పశ్చిమ జిల్లా తరఫున నిర్వహించే బహిరంగ సభలో పళనిస్వామి పాల్గొంటారని, అలాగే, ఆయా సభల్లో ప్రసంగించనున్న నేతలు వివరాలను పళనిస్వామి ప్రకటనలో తెలిపారు.

### రూ.5 కోట్లతో ఎల్లయమ్మకు కొత్త ఆలయం

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌ని పురాతన ఎల్లయమ్మ ఆలయం, రోడ్డు కంటే కిందుక ఉండడంతో వర్షాల సమయంలో భవనం దెబ్బతింది. ఆలయాన్ని పునరుద్ధరించాలనే భక్తుల విజ్ఞప్తి మేరకు హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొత్త ఆలయ నిర్మాణానికి కొద్ది నెలల క్రితం పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. అందులో, రూ.1.42 కోట్లతో కరుంగాల్ ప్రాకార మండపం, రూ.25 లక్షలతో గర్భాలయం, రూ.10 లక్షలతో విమాన గోపురం, రూ.1.452 కోట్లతో ఇతర పనులు మొత్తం రూ.5 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయ నిర్మాణం పూర్తిచేసి జనవరిలో కుంభాభిషేకం నిర్వహించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

### భారీ వర్షాలతో ఉప్పు ఉత్పత్తికి అంతరాయం



ఉప్పు మడిపై టార్పాలిన్ కప్పుతున్న కార్మికుడు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఉప్పు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వేదారణ్యం, అగస్తియన్‌పల్లి, కొడియక్కాడు, కడినల్‌వయల్ సహా పరిసర ప్రాంతాల్లో సుమారు 9వేల ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉప్పు మళ్లలో నీరు చేరి ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అలాగే, ఉప్పు పేర్చిన ప్రాంతాలపై కార్మికులు టార్పాలిన్ కప్పి జాగ్రత్తలు చేపట్టారు. ఉప్పు ఉత్పత్తి లేకపోవడంతో వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయారు.

### తిరువళ్లూరు గ్రీవెన్స్‌కు 383 వినతులు



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో 383 వినతిపత్రాలు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరింపజేయాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 383 వినతిపత్రాలను కలెక్టర్ స్వీకరించి సకాలంలో సమస్యలు పరిష్కరింపజేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కనిమొళి, రెవెన్యూ అధికారులు సురేష్, జిల్లా సహాయకార్యదర్శి వెంకట్రామన్, సబ్ కలెక్టర్ బాలమురుగన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేశన్, వెంకటేశన్, బీసీ,ఎస్సీ,ఎస్టీ సంక్షేమశాఖ ఉన్నతాధికారిణి ఉషారాణి సహా పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో మంగళవారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరువొత్తియూర్ మండల పరిధిలో 2వ వార్డు కామరాజ్ నగర్‌లోని ఎన్నూర్ వ్యాపారుల సంఘం కార్యాలయం, మనలి మండల పరిధిలో 15వ వార్డు పుదునాపాళయంలోని చెన్నై ప్రాథమిక పాఠశాల మైదానం, మాధవరం మండల పరిధిలో 31వ వార్డు పుళల్ కదిర్‌వేడు సెంబియం-రెడ్‌హిల్స్ మెయిన్ రోడ్డు సమీపంలోని ఎంబీ కల్యాణ మండపం, రాయపురం మండలం పరిధిలో 50వ వార్డు ఎన్ఎన్ చెట్టి వీధిలోని అరివగం కల్యాణ మండపం, అంబత్తూర్ మండల పరిధిలో 92వ వార్డు మొగప్పేర్ వెస్ట్ గోల్డెన్ జార్జి నగర్‌లోని ఎస్కేవీ కల్యాణ మండపంలో జరుగుతాయి. అదే విధంగా అన్నానగర్ మండల పరిధిలో 106వ వార్డు అరుంబాక్కం ఎంఎండీఏ కాలనీలో మహ్మద్ సాధిక్ మెట్రిక్ మహోన్నత పాఠశాల, తేనాంపేట మండల పరిధిలో 109వ వార్డు నుంగంబాక్కం గిల్ నగర్ క్రీడా మైదానం, కోడంబాక్కం ఎరిధిలో 132వ వార్డు అంబేడ్కర్ రోడ్డులోని కమ్యూనిటీ హాలు, వలసరవాక్కం పరిధిలో 143వ వార్డు నొలంబూర్-మొగప్పేర్ మెయిన్ రోడ్డులోని వేలమ్మాళ్ హాలు, ఆలందూర్ పరిధిలో 160వ వార్డు సన్యాసి, సుబేదార్ ఆలయ వీధిలోని ఎస్‌వీఎస్ జైన్ సంఘం, అడయార్ మండల పరిధిలో 169వ వార్డు సైదాపేట తాడంగర్ నగర్‌లోని కమ్యూనిటీ హాలు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాల్లో ప్రజలు పాల్గొని, ప్రభుత్వ పథకాల్లో లబ్దిదారులుగా చేరేందుకు దరఖాస్తులు సమర్పించవచ్చని జీసీసీ తెలిపింది.

### రేపు శిబిరాలు జరిగే ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో బుధవారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. 1వ మండలం పరిధిలో ఎన్నూర్ మార్కెట్ వీధి అన్నై శివగామి నగర్ 5వ వీధిలోని కమ్యూనిటీ హాలు, 4వ మండల పరిధి కొడుంగైయూర్ ఆర్వీ నగర్‌లోని గురుమూర్తి స్కూల్, 6వ మండలం పరిధి పెరంబూర్ మంగళాపురం కృష్ణదాస్ మెయిన్ రోడ్డులోని చెన్నై ప్రైమరీ స్కూలు, 7వ మండలం పరిధిలో మొగప్పేర్ గోల్డెన్ జార్జి నగర్ టీఎన్ఈబీ రోడ్డులోని ఎస్కేవీ కల్యాణ మండపం, 8వ మండలం పరిధి అమింజికరై మెహతా నగర్ ఆఫీసర్స్ కాలనీలోని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ క్రీడా మైదానం, 9వ మండలం పరిధి నుంగంబాక్కం మహాలింగపురం రోడ్డు సూళైపురంలోని సెయింట్ జోసఫ్ చర్చి, 10వ మండలం పరిధి వెస్ట్ సైదాపేట రంగభాష్యం వీధిలోని మోహనాంబాళ్ కల్యాణ మండపంలో శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, 11వ మండలం పరిధిలో నెర్కుండ్రం పీహెచ్ రోడ్డులోని వెంగాయ మండి, 12వ మండలంలో పల్లవన్‌తాంగళ్ నేహ్రూ కాలనీలోని కమ్యూనిటీ హాలు, 14వ మండలంలో ఉల్లగరం పుళిదివాక్కం మెయిన్ రోడ్డు (కుమరన్ థియేటర్ సమీపం)లోని సుమంగళి కల్యాణ మండపం, 15వ మండలం పరిధి ఒక్కియంపేట మాతా ఆలయ వీధిలోని క్రియేట్స్ పార్టీ హాలు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాల్లో సమస్యలపై వినతిపత్రాలు సమర్పించి పరిష్కారం పొందవచ్చని జీసీసీ తెలిపింది.

## ఇన్‌స్టా బ్లాక్ చేసిన ప్రియుడు

● యువతి ఆత్మహత్యాయత్నం

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు తన ఇన్‌స్టాగ్రామ్‌ను బ్లాక్ చేయడంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చేపాక్కంకు చెందిన విద్యార్థినికి, ఓ యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కొద్దిరోజుల క్రితం వీరిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడినట్లు సమాచారం. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌ను యువకుడు బ్లాక్ చేయడంతో, మనస్తాపం చెందిన విద్యార్థిని, సోమవారం ఉదయం నుంగంబాక్కంలోని ఓ హోటల్ 4వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### శునకం దాడిలో బాలుడికి గాయాలు

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేటలో నిషేధిత 'రాట్ వీలర్' జాతికి చెందిన శునకం దాడిలో మహేంద్రవర్మ (13) అనే బాలుడికి గాయాలయ్యాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిపై రాట్ వీలర్ దాడిచేసింది. గమనించిన చుట్టుపక్కల వారు శునకాన్ని తరిమి, బాలుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

## టూరిస్ట్ వ్యాన్ బోల్తా

● 11 మందికి గాయాలు



ప్రమాదంలో బోల్తాపడిన టూరిస్టు వ్యాన్

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొట్టిమేడు ఘాట్‌రోడ్డులో సోమవారం వేకువజాము టూరిస్టు వ్యాన్ బోల్తాపడటంతో 11 మంది గాయపడ్డారు. తంజావూరు శాస్త్రా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్న 21 మంది విద్యార్థులు సెలవుల కారణంగా కేరళలోని మూనారుకు విహారయాత్రగా వెళ్లారు. మూడు రోజులు మూనారులో పర్యటించిన తర్వాత ఆదివారం రాత్రి అందరూ టూరిస్టు వ్యాన్‌లో తంజావూరు బయలుదేరారు. సోమవారం వేకువజాము ఆ వ్యాన్ పొట్టిమేడు ఘాట్‌రోడ్డు మీదుగా వెళ్తూ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 11 మంది గాయపడ్డారు. సమాచారం అందగానే కురంగుని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదె

● బైక్ నుంచి కిందపడి ప్రేమ జంట మృతి



మృతులు నవీన్, అభిమన్యు (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై హఠాత్తుగా వచ్చిన ఆవును తప్పించబోయి బైక్ నుంచి జారిపడి ప్రేమ జంట మృతిచెందిన ఘటన స్థానిక తాంబరంలో ఆదివారం చోటుచేసుకుంది. అన్నా నగర్‌కు చెందిన నవీన్ (19), తన ప్రియురాలు అభిమన్యుతో కలసి బైక్‌పై తాంబరం సమీపం పడప్పై మీదుగా వెళ్తున్నాడు. వంతెనపై బైక్ వెళ్తున్న సమయంలో, హఠాత్తుగా రోడ్డుకు అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయిన బైక్ గేదెను ఢీకొంది. ఈ ఘటనలో బైక్ పై నుంచి ఇద్దరు కింద పడగా, ఎదురుగా వచ్చిన కారు వారిమీదుగా వెళ్లింది. తీవ్రగాయాలతో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### రైలులో మత్తు బిళ్లలు తరలిస్తున్న నలుగురి అరెస్ట్



నిందితులు దురైరాజ్, నటరాజన్, విజయ్, ఏలుమలై

తిరుత్తణి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలులో మత్తు బిళ్లలు తరలిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా.. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి గంజాయి, గుట్కా, మత్తు బిళ్లలను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్పీ వివేకానంద శుక్లా నేతృత్వంలోని పోలీసు బృందం రెండు వారాలుగా తిరుత్తణి, అరక్కోణం, తిరువళ్లూరు రైల్వేస్టేషన్లు, రహదారుల వద్ద నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేసి రైలు నుంచి దిగి పరుగులు తీస్తున్న నలుగురిని పోలీసులు వెంబడించి వారిని తనిఖీ చేయగా, రూ.1.60 లక్షలు విలువచేసే 3,200 మత్తు బిళ్లలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయువకులు చెన్నై బీసెంట్‌నగర్‌కు చెందిన దురైరాజ్ (25), నటరాజన్ (26), విజయ్ (22), ఏలుమలై (29)లుగా గుర్తించి కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు ఆ నలుగురిని రిమాండ్‌కు తరలించారు.

### కోటి రూపాయల కోసం బీడీవో కిడ్నాప్

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా పల్లిపాళెయం యూనియన్‌లో బీడీవో (బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) ప్రభాకర్ (54)ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి కోటి రూపాయలు డిమాండ్ చేశారు. ఈ కిడ్నాప్ సంఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. బీడీవో ప్రభాకర్ ఈ నెల 4వ తేదీన విధులను ముగించుకుని ఇంటికి వస్తుండగా, మార్గమధ్యంలో కొందరు అడ్డగించి కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత రాత్రి 9.45గంటలసమయంలో ఆయన భార్యకు ఫోన్‌చేసి ప్రభాకర్‌ను కిడ్నాప్ చేశామని, రూ.కోటి ఇచ్చి విడిపించుకోవాలని దుండగులు బెదిరించారు.దీంతో ఆందోళన చెందిన ప్రభాకర్ సతీమణి..పోలీసులను ఆశ్రయించారు. వారు వెంటనే రంగంలోకిదిగి మొబైల్ సిగ్నెల్స్ ఆధారంగా కిడ్నాపర్ల ఆచూకీ కనిపెట్టి నందకుమార్, శివ అనే ఇద్దరు కిడ్నాపర్లను అరెస్టు చేశారు. ఈ కిడ్నాప్ కేసులో ప్రధాన సూత్రధారి అయిన కిరాయి ముఠా నేత కోసం గాలిస్తున్నారు.

### ఏడు కిలోల గంజాయి స్వాధీనం

● జార్ఖండ్ వాసి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని జార్ఖండ్ వాసిని అరెస్టు చేశారు. ఈ స్టేషన్‌లోని నాలుగో నంబరు ఫ్లాట్‌ఫారానికి సోమవారం ఉదయం వచ్చిన షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో దిగిన ప్రయాణికుల్లో అనుమానాస్పందంగా ఉన్న వారి లగేజీని రైల్వే పోలీసులు తనిఖీ చేశారు. పెద్ద ట్రాలీ సూట్‌కేసుతో వచ్చిన వ్యక్తిని గుర్తించి, అతడి సూట్‌కేసు తనిఖీ చేయగా అందులో గంజాయి కనిపించింది.. ఆ ప్రయాణికుడు సంతోష్ ఒడిశా రాష్ట్రం నుంచి ఈ గంజాయిని అక్రమంగా తీసుకొస్తున్నట్టు విచారణలో వెల్లడించారు.

### సచివాలయానికి బాంబు బెదిరింపు

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తి ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. సోమవారం ఉదయం కార్యాలయ వచ్చిన ఈమెయిల్ బెదిరింపు గమనించిన సిబ్బంది సచివాలయ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గంట పైగా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో ఎలాంటి పేలుడు పదార్థాలు బయటపడలేదు. ఈ బెదిరింపు కారణంగా సచివాలయంలో గంటపాటు ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఇదే విధంగా గిండిలోని గవర్నర్ అధికారిక నివాసం రాజ్‌భవన్‌కు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. ఈ సమాచారం అందగానే పోలీసు ఉన్నతాధికారులు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీ చేసి, అది ఉత్తుత్తి బాంబు బెదిరింపు అని నిర్ధారించారు.

### రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రధాని మోదీ కారణం : తమిళిసై

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి విదేశాల నుంచి పెట్టుబడులు ఆకర్షించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కారణమని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు. తూత్తుకుడి విమానాశ్రయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి విదేశాల్లో పర్యటించి సోమవారం రాష్ట్రానికి చేరుకున్నారని, పెట్టుబడులు తీసుకొచ్చామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ప్రధాన మంత్రి మోదీ విదేశాలకు వెళ్లి తమ బలాన్ని చూపించడంతోనే మన 'డాడీ' అంటూ పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి ఏఏ దేశాలకు వెళ్లారు, ఎంత మొత్తంలో పెట్టుబడులు తెచ్చారు అనే వివరాలు లేవని, అది ఆయన సాధించింది కాదని, అందుకు కారణం ప్రధాని మోదీ అని తమిళిసై తెలిపారు.

# విజయ్ కల నెరవేరాలి: త్రిష


విజయ్ - త్రిష

కోలీవుడ్ అగ్రహీరో విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై సినీ నటి త్రిష స్పందించారు. ఆయన కోరిక నెరవేరాలని ఆమె ఆకాంక్షించారు. పైగా ఆయన కోరుకునేదానికి పూర్తిగా అర్హుడంటూ విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దుబాయ్ వేదికగా జరిగిన సైమా వేడుకల్లో పాల్గొన్న త్రిష యాంకర్ అడిగిన ప్రశ్నకు పై విధంగా స్పందించారు. 'విజయ్ కల నెరవేరాలి. అతని కలలు ఏవైనా కావొచ్చు. అవి ఖచ్చితంగా నెరవేరుతాయి. ఆయన దానికి అర్హుడు' అంటూ వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, చిత్రపరిశ్రమలో 25 యేళ్ళు పూర్తి చేసుకున్నందుకుగాను త్రిషకు ప్రత్యేక అవార్డుతో సన్మానించారు. ఇదిలావుంటే గత కొంతకాలంగా విజయ్ - త్రిష మధ్య ఏదో సంబంధం ఉందనే ప్రచారం కోలీవుడ్‌లో సాగుతోంది. వీరిద్దరూ కలిసి 'ది గోట్'లో నటించిన తర్వాత ఈ పుకార్లు మరింతగా ఎక్కువైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో విజయ్‌ని ఉద్దేశించి త్రిష చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.

# రజనీతో కలిసి మీ ముందుకు వస్తా

- కమల్ హాసన్



సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి నటించాలని ఎన్నో ఏళ్ళుగా ప్రయత్నిస్తూనే ఉన్నానని, అది చాలాకాలం వరకూ సాధ్యపడలేదని, అయితే, త్వరలోనే తామిద్దరం కలిసి ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు అగ్ర నటుడు కమల్ హాసన్ వెల్లడించారు. దుబాయ్ వేదికగా జరిగిన సైమా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కమల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, 'ప్రేక్షకులు మా కాంబినేషన్ ఇష్టపడితే మంచిదే కదా. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. రజనీ, నేనూ కలిసి స్క్రీన్‌పై కనిపించాలని ఎన్నో ఏళ్ళుగా అనుకుంటున్నాం. కానీ, ఇన్ని రోజులు అది సాధ్యపడలేదు. త్వరలోనే మేమిద్దరం కలిసి మీ ముందుకు వస్తాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది. మా ఇద్దరి మధ్య ఎలాటి విభేదాలు లేదా పోటీ లేదు. ఇవన్నీ మీరు సృష్టించుకున్నవే. పైగా మేమిద్దరం కలిసి నటించేందుకు ఎదురు చూశాం. ఒకరి సినిమాలు మరొకరం నిర్మించాలని కూడా ప్రయత్నించాం' అని కమల్ హాసన్ పేర్కొన్నారు. కాగా, కమల్ హాసన్ ప్రకటించినట్టుగా ఈ ప్రాజెక్టు ఖరారైతే 46 యేళ్ళ తర్వాత వెండితెరపై వారిద్దరూ కనిపించనున్నారు. అయితే, ఈ ప్రాజెక్టు వివరాలను మాత్రం కమల్ హాసన్ బహిర్గతం చేయలేదు. అయితే, ఈ చిత్రానికి లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించవచ్చని, రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్ కలిసి నిర్మించవచ్చనే టాక్ వినిపిస్తోంది.

## షూటింగ్‌లో అపశ్రుతి

- హీరో అశోక్‌కు ప్రమాదం

'వడ మంజువిరట్టు' సినిమా చిత్రీకరణలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న జల్లికట్టు ఎద్దు... నియంత్రణ కోల్పోయి, హీరోను కొమ్ములతో పొడిచింది. దీంతో ఆయన పొట్టభాగంలో గాయమైంది. ఈ ఘటనతో చిత్ర యూనిట్ సభ్యులంతా ఆందోళనకు గురయ్యారు. 'వడ మంజువిరట్టు' అనేది తమిళ సంస్కృతిలోని పురాతన క్రీడల్లో ఒకటి. ఈ క్రీడా నేపథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుంది. నేల, ప్రజలు, సంస్కృతి, ప్రేమ, ఆప్యాయత, ధైర్యం ఇత్యాది అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో 'మురుగ' ఫేం అశోక్ హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే 25కు పైగా చిత్రాల్లో నటించారు. ఈ నేపథ్యంలో సంగిలి సీపీఏ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వీరోచితమైన హీరో పాత్ర పోషిస్తున్నారు. దిండిగల్ జిల్లా అంజుకులిప్పట్టి గ్రామీణ ప్రాంతంలో కొన్ని సన్నివేశాలను జల్లికట్టు ఎద్దు, అశోక్‌పై చిత్రీకరిస్తుండగా, ఈ ప్రమాదం జరిగింది. దీనిపై హీరో అశోక్ స్పందిస్తూ, 'చిన్న గాయమైనప్పటికీ కొమ్ము మరింత లోతుగా వెళ్ళివుంటే ఊపిరితిత్తులకు గాయమైవుండేదని వైద్యులు చెప్పారు. ఇది అనుకోకుండా జరిగింది. మరుసటి రోజు నుంచే షూటింగ్‌లో పాల్గొన్నాను. అది శివుడి వాహనం. ఇపుడు నేను ఆ శివుని దయ వల్లే బయటపడ్డాను' అని అశోక్ అన్నారు.


'మురుగ' అశోక్

## తమిళంలో హాలీవుడ్ మూవీ 'ట్రాన్: ఏరీస్'

చిత్రజ్యోతి

- అక్టోబరు 10న విడుదల

ప్రపంచ సినీ అభిమానులు అమితాసక్తితో ఎదురు చూస్తున్న ప్రతిష్ఠాత్మక హాలీవుడ్ చిత్రం 'ట్రాన్: ఏరీస్'. జోయాకిగ్ రోన్నింగ్ దర్శకత్వం వహించారు. తమిళం, తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో అక్టోబరు 10న ఈ చిత్రం విడుదలకానుంది. ఇందులో జారెడ్ లేటో ప్రధాన పాత్రలో నటించగా, గ్రెటా లీ, ఎవాన్ పీటర్స్, హసన్ మినహాజ్, జోడీ టర్నర్ స్మిత్, గిల్లియన్ అండర్సన్ వంటి హాలీవుడ్ నటీనటులు కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. సైన్స్ ఫిక్షన్‌లో విప్లవాత్మక మార్పులు టెచ్చిన 'ట్రాన్'. 1982లో విడుదలైంది. ఈ చిత్రం సీక్వెల్ 'ట్రాన్: లెగసీ'. 2010లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇదే సిరీస్‌లో ఇపుడు వస్తున్న చిత్రం 'ట్రాన్: ఏరీస్'. డిజిటల్ ప్రపంచం నుంచి రియల్ ప్రపంచంలోకి అడుగుపెట్టే కథ ఇది. ఇదే మానవులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) జీవుల మధ్య తొలి సమావేశంగా నిలువనుంది. అందుకే ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై అమితాసక్తి నెలకొంది.



'ట్రాన్: ఏరీస్'లో ఓ దృశ్యం

# పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వ సహకారం

- డిప్యూటీ సీఎం ఉదయనిధి
- జేకే ఫెన్నర్‌కు 70 వసంతాలు


ఉప ముఖ్యమంత్రి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న విక్రమ్‌పతి సింఘానియా

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వెల్లడించారు. జేకే ఆర్గనైజేషన్‌కు చెందిన జేకే ఫెన్నర్ (ఇండియా) 70వ వార్షికోత్సవం తాజాగా జరుపుకుంది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి చేతుల మీదుగా ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ విక్రమ్‌పతి సింఘానియా ప్రత్యేక జ్ఞాపిక అందుకున్నారు. ఏడు దశాబ్దాల జేకే ఫెన్నర్ అద్భుత ప్రయాణాన్ని ఈ సందర్భంగా ఉదయనిధి ప్రత్యేకంగా అభినందించారు. జేకే ఫెన్నర్ వంటి కంపెనీల సహకారంతో రాష్ట్రం బలమైన పారిశ్రామిక స్థావరంగా మారి, వృద్ధి రేటు 11.19 శాతంగా నమోదైందన్నారు. పారిశ్రామిక కంపెనీల విస్తరణకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన వెల్లడించారు. ఎండీ విక్రమ్‌పతి మాట్లాడుతూ, చెన్నై ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న జేకే ఫెన్నర్‌కు మొత్తం తొమ్మిది అత్యాధునిక ప్లాంట్లుండగా, ఇందులో ఐదు ప్లాంట్లు తమిళనాడులోనే ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో గణనీయమైన పెట్టుబడులు పెడుతూ, పునరుత్పాదక ఇంధనలో 9.75 మెగావాట్లు ఉందనానరు. ఈ కార్యక్రమంలో జేకే ఫెన్నర్ (ఇండియా) ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.


వివిధ రంగాల్లో తమిళభాషకు సేవలందిస్తూ తమిళ పదాల ఉచ్చరణలో మేటిగా నిలిచిన ప్రముఖులకు రాష్ట్ర తమిళభాషాభివృద్ధి శాఖ తరపున సచివాలయంలో నగదు పురస్కారాలు అందజేస్తున్న ఆ శాఖ మంత్రి సామినాథన్


తిరువిక నగర జోన్‌లో కొళత్తూరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు


పుస్తక పఠనంలో ఉద్యోగులు, విద్యార్థులు, అధికారులు

## 2 లక్షల మందితో 'పుదుకోట చదువుతోంది'

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా యంత్రాంగం, తమిళనాడు సైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. 12వ తేది వరకు జరుగనున్న ఈ ప్రదర్శనలో భాగంగా సోమవారం 'పుదుకోట చదువుతోంది' కార్యక్రమం నిర్వహించారు. పుదుకోట రాణియార్ ప్రభుత్వ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం.అరుణ లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పుస్తక పఠనం చేపట్టారు. అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా నిర్వహించిన ఈ పుస్తక పఠనంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది పాల్గొన్నారని కలెక్టర్ అరుణ తెలిపారు.

## ఎండీఎంకే నుంచి మల్లై సత్య బహిష్కరణ



అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే సహాయ ప్రధాన కార్యదర్శి మల్లై సత్యాను పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శి వైగోకు, ముఖ్య కార్యదర్శి దురై వైగో, మల్లై సత్య మధ్య మనస్పర్థలు తలెత్తాయి. తండ్రీకొడుకులు వైగో, దురై వైగోలపై మల్లై సత్య విమర్శలు గుప్పించారు. పైగా పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారంటూ మల్లై సత్యను పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్టు వైగో పేర్కొన్నారు.




## అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్రదానాన్ని ప్రోత్సహిస్తూ మానవహారం

మానవహారంలో పాల్గొన్న అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా నగరంలోని డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్రదానాన్ని ప్రోత్సహిస్తూ సోమవారం మానవహారం ఏర్పాటు చేశారు. ఆస్పత్రి క్లినికల్ సర్వీసెస్ హెడ్ డాక్టర్ ఎస్. సౌందరి జెండా ఊపి ఈ మానవహారాన్ని ప్రారంభించారు. నగరంలోని అగర్వాల్ ఐ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది, డాక్టర్ అగర్వాల్ ఐ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు సహా సుమారు 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇళ్ల వద్దే పారిశుధ్య కార్మికుల దీక్ష

- పోలీసుల జోక్యంతో భగ్నం


కొరుక్కుపేట ఇందిరానగర్‌లో నిరాహార దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుక్కుపేట ఇందిరా నగర్‌లో మహిళా పారిశుధ్య కార్మికులు తమ కోర్కెల సాధన కోసం సోమవారం ఉదయం తమ ఇళ్లవద్దే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఇటీవల జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం ఎదుట 5, 6 జోన్లకు చెందిన పారిశుధ్య కార్మికులు శానిటేషన్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆగస్టు ఒకటి నుంచి 13 వరకు ఆందోళనలు జరిపిన విషయం తెలిసిందే. ఆగస్టు 13 అర్ధరాత్రి పోలీసులు పారిశుధ్య కార్మికులందరినీ అరెస్టు చేశారు. ఆ నేపథ్యంలో ఈ నెల 4న చింతాద్రిపేట మేడే పార్కు వద్ద సమావేశమై తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు సుమారు 300 మంది పారిశుధ్య కార్మికులు సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అందరినీ అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో కొరుక్కుపేట ఇందిరా నగర్‌లో నివసిస్తున్న 13 మంది మహిళా పారిశుధ్య కార్మికులు తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని, పారిశుధ్య పనులను ప్రైవేటీకరణ చేయకూడదని డిమాండ్ చేస్తూ సోమవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్ళారు. ఆందోళన విరమించుకోమని పలుమార్లు హెచ్చరించారు. తమ ఇళ్ల వద్ద ఆందోళన చేసే హక్కు తమకుందని, ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకునే ఆస్కారం లేదని మహిళా పారిశుధ్య కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు దీక్ష చేస్తున్నవారిని అక్కడి నుండి తొలగించారు. ఈ విషయమై పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ శాంతియుతంగా తమ ఇళ్ల వద్ద నిరాహార దీక్ష చేపడితే పోలీసులు జోక్యం చేసుకోవడం చట్ట వ్యతిరేకమని, అంతే కాకుండా అరెస్టు చేసి వ్యాన్లలో తరచడం అన్యాయమన్నారు.


పోలీసులతో గొడవకు దిగుతున్న మహిళలు


కన్నియాకుమారిలోని పూంపుహార్ సంస్థ వద్ద పర్యాటకులు

## కుమరిలో మళ్లిన సముద్రం

- ఆలస్యంగా ప్రారంభమైన బోట్ సవారీ

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో పౌర్ణమి సందర్భంగా సముద్రనీటిమట్టం ఉన్నట్టుండి తగ్గుముఖం పట్టింది. త్రివేణి సంగమం సంగిలిత్తురై తీరంలో సుమారు 50 అడుగుల మేర సముద్రం వెనక్కి వెళ్ళింది. హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రంలో అలల ఉధ్రుతి అధికమైంది. కానీ బంగాళాఖాతంలో సముద్రం వెనక్కి వెళ్ళి, నీటిమట్టం ఉన్నట్టుండి తగ్గింది. దీంతో సముద్రం తీరమంతా పచ్చటి నాచుతో బండరాళ్లే కనిపించాయి. దీని కారణంగా వివేకానంద స్మారకమండపానికి పూంపుహార్ షిప్పింగ్ సంస్థ బోట్ సవారీ గంటపాటు నిలిపివేసింది. ఉదయం 9 గంటలకు సముద్రం యధాస్థితికి రావటంతో బోట్ సవారీ ప్రారంభమైంది. కన్నియాకుమారి, చిన్న ముట్టమ్, వావత్తురై, కోవళం, కీళ్‌మనక్కుడి, మనక్కుడి తదితర సముద్రతీర గ్రామాల్లోనూ సముద్రం వెనక్కివెళ్ళింది. దీంతో తీర ప్రాంతాలలో ఇసుకదిబ్బలు, నాచుతో కప్పేసిన బండరాళ్లు కనిపించాయి. దీనితో వట్టకోట ప్రాంతానికి లగ్జరీ బోట్ సవారీని నిలిపివేశారు.

## మారియమ్మన్ ఆలయంలో జ్యోతిపూజ


జ్యోతి పూజలో భక్తులు

పెరంబూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమయపురం మారియమ్మన్ ఆలయంలో ప్రతి నెలా పౌర్ణమి రోజున సాయంత్రం 6 గంటలకు జ్యోతి పూజ నిర్వహించడం ఆనవాయితి. ఆ ప్రకారం, ఆవని పౌర్ణమి సందర్భంగా ఆదివారం జ్యోతి పూజ జరిగింది. చంద్ర గ్రహణం కారణంగా ముందుగానే మధ్యాహ్నం 3 గంటలకు పూజ ప్రారంభించారు. అమ్మవారి సన్నిధి ముందున్న మండపంలో జరిగిన పూజలో 108 మహిళలు పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు, ఇత్తడి కామాక్షి అమ్మవారి దీపం (125 గ్రాములు), కుంకుమ, పసుపు, పూజా సామగ్రి, చీర, జాకెట్ సహా 22 రకాల వస్తువులు అందజేశారు.

## సెంటర్ మీడియాలో చిక్కుకున్న ఎలక్ట్రిక్ బస్సు



అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూర్‌లో సెంటర్ మీడియాలో విద్యుత్ బస్సు చిక్కుకోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరంలో ఎంకేబీ నగర్, పెరుంగుడి తదితర డిపోల నుంచి ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నారు. ఈ క్రమంలో, కొళత్తూర్‌లోని ఇరుకు రోడ్డులో రివర్స్ తీసుకునేందుకు యత్నించిన విద్యుత్ బస్సు సెంటర్ మీడియాలో చిక్కుకుంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. అనంతరం బస్సును సెంటర్ మీడియా నుంచి బయటకు తీసి యధావిధిగా నడిపారు.

## మంత్రి నాజర్ ఆధ్వర్యంలో 'నలంకాక్కుమ్ స్టాలిన్' శిబిరం


పారిశుధ్య కార్మికులకు సహాయాలు పంపిణీ చేస్తున్న మంత్రి నాజర్ తదితరులు

తిరుత్తణి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పూందమల్లి సమీపంలోని కాట్టుపాక్కంలోని ఏవీఎస్ హయ్యర్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో సోమవారం మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ఎం.నాజర్ ఆధ్వర్యంలో నలంకాక్కుమ్ స్టాలిన్ జరిగింది. ఈ శిబిరంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాజర్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నలంకాక్కుమ్ స్టాలిన్ శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ, నూతన పథకాలకు శ్రీకారం చుడుతోందన్నారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న 146 మంది పారిశుధ్య కార్మికులకు హెల్త్‌కార్డులు, గుర్తింపుకార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఎమ్మెల్యే ఎ.కృష్ణస్వామి, వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ డా.అంబికా షణ్ముగం, ఆరోగ్యశాఖ అధికారులు ప్రియారాజ్, డాక్టర్ ప్రభాకరన్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇళయరాజా పాటల వాడడంపై తాత్కాలిక స్టే

- మద్రాస్ హైకోర్టు ఆదేశం

అడయార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరపరిచిన పాటలను సినిమాల్లో ఉపయోగించకుండా మద్రాస్ హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించింది. హీరో అజిత్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో తన అనుమతి లేకుండా తాను స్వరపరిచిన పాటలను వినియోగించారని, ఈ పాటను తక్షణం తొలగించేలా ఆదేశించాలని, అనుమతి లేకుండా పాటలను ఉపయోగించినందుకు రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని ఇళయరాజా తరపున ఆయన న్యాయవాదులు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి సెందిల్ కుమార్... ముందస్తు అనుమతి పొందకుండా అజిత్ చిత్రంలో ఇళయరాజా పాటలను వాడకుండా తాత్కాలిక స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## పుదుచ్చేరి బీజేపీకి సామినాథన్ గుడ్‌బై



పుదుచ్చేరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సామినాథన్ పార్టీ నుండి వైదొలిగారు. బీజేపీ పుదుచ్చేరి అధ్యక్షుడిగా సామినాథన్ 2014లో నియమితులయ్యారు. ఎనిమిదేళ్ళపాటు ఆయన ఈ పదవిలో కొనసాగారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని ప్రతి మూడేళ్లకు ఒకసారి మార్చడం ఆనవాయితీ. అయితే సామినాథన్ ఎనిమిదేళ్లపాటు ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా కొనసాగగా, 2023 సెప్టెంబర్‌లో అధ్యక్ష పదవి నుండి సామినాథన్‌ను పార్టీ తొలగించింది. ఆ తర్వాత ఆయన స్థానంలో ఎంపీ సెల్వగణపతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో సామినాథన్ పార్టీ నుండి వైదొలగుతున్నట్టు ప్రకటించారు. 25 యేళ్లకు పైగా తాను బీజేపీకి సేవలందించానని, ప్రస్తుతం పార్టీ వ్యవహారాలకు దూరమవుతున్నానని వివరించారు.

## తిరుమలలో లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్



లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్, కార్పొరేట్ మాజీ లాబియిస్ట్ నీరా రాడియా, తెలంగాణ ఎమ్మెల్సీ దయానంద్ ఉన్నారు.

# తిరుమలలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన


తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం పరిశీలించారు. మాడవీధుల్లోకి ప్రవేశించే మార్గాలను పరిశీలించారు. గరుడసేవ సమయంలో అదనంగా ఏర్పాటు చేయనున్న క్యూలైన్లపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేశారు.

**తనిఖీలు :** పోలీసులు, విజిలెన్స్, బాంబ్‌స్క్వాడ్, రెవిన్యూ, ఫారెస్ట్, ఫైర్, విద్యుత్, హెల్త్ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి అలిపిరి కాలినడక మార్గంలో తనిఖీలు చేశారు. 150 దుకాణాలను పరిశీలించి నిబంధనలను పాటించని 13 దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. సీసీ కెమెరాలు లేని దుకాణ యజమానులను హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న హాకర్లను అదుపులోకి తీసుకుని తిరుపతికి పంపారు. ఇలా ఉండగా అత్యవసర సమయాల్లో భక్తులకు సీపీఆర్ చేసే అంశంపై సోమవారం పోలీసు సిబ్బందికి తిరుపతి రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్లు ప్రసాద్, ప్రతీత్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేయనున్న క్యూలైన్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

## సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు**

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 27,410**

**తలనీలాలు సమర్పించినవారు: 9,656**





వీధుల్లో భిక్షాటన చేస్తున్న బుర్రకథ కళాకారులు

# బుర్రకథ అడ్డం తిరిగింది!

కాలప్రవాహంలో కొన్ని కళలు అంతరించిపోవడం, కొన్ని రూపాలు మార్చుకోవడం సహజం. ఒకప్పుడు పల్లెల్ని ఉర్రూతలూగించిన జానపద కళల్లో బుర్రకథ ఒకటి. ఒక ప్రధాన కళాకారుడు కథ చెబుతుంటే, ఇద్దరు వంత పలుకుతూ ఉంటారు. జిలుగు వెలుగుల దుస్తులు, తలపాగా, వాయిద్యాలతో వీరు కథను రక్తి కట్టిస్తారు. ప్రధాన కథ మధ్యలో వీరు చెప్పే పిట్టకథలకు జనం పగలబడి నవ్వేవారు. వేసవి కాలంలో ఊరుమ్మడిగా బుర్రకథలను చెప్పించుకునేవారు. కళాకారులకు ధన, ధాన్యాలిచ్చి సత్కరించేవారు. ఈ జానపద కళ.. జాతీయోద్యమంలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో కీలక పాత్ర పోషించింది. కమ్యూనిస్టు పోరాటాల్లోనూ బుర్రకథది ప్రధాన భూమిక. గతం ఘనమే కానీ వర్తమానం మాత్రం బుర్రకథ కళాకారులకు దయనీయంగా మారింది. అందుకు సాక్ష్యమే ఈ చిత్రం. డక్కిలి మండలం వెంబులూరు హరిజనవాడకు చెందిన వెంకటయ్య దేశరాజుకథ, కళింగరాజుకథ, మరాఠీలకథ, చంద్రబోస్, లక్ష్మమ్మ, చిన్నయ్య, గంగా కళ్యాణం, తాంబోజురాజు కథ, పసలబాలుడికథ వంటివి బుర్రకథలుగా చెప్పేవాడు. అనేక ఊళ్లలో ఈయనను పిలిచి కథలు చెప్పించుకునేవారు. ఒకప్పుడు ఆలయాల్లో, ఊరి కూడళ్లలో ఏర్పాటు చేసిన వేదికలమీదా కథలు చెప్పిన వెంకటయ్య ఇప్పుడు సైకిలేసుకుని ఊరూరా తిరుగుతున్నాడు. కథ చెప్పించుకునేవారు కరువవడంతో ఇల్లిల్లూ తిరిగి కథలోని ఒక పాటో, పద్యమో వినిపించి చేతులు చాస్తున్నాడు. ఇదే ఆయనకు కూడు పెడుతోంది. ప్రస్తుతం వెంకటగిరి 7వ వార్డు కోళ్ల ఫారం వద్ద నివాసం ఉంటున్న ఇతను తన చిన్నాన్న కొడుకు పోలయ్యతో కలిసి ఇలా పల్లెలు తిరుగుతున్నాడు. 'సేద్యం పనులుంటే పల్లెలోనే కూలి దొరికేది.. ఇట్లా టవున్లలో తిరిగి నాలుగిళ్లు అడుక్కుంటేనే కడుపు నిండుతోంది' అని చెబుతున్నాడు వెంకటయ్య.

**- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి**

## పీజీఆర్ఎస్ వినతులపై ప్రత్యేక దృష్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 106 వినతులు వచ్చాయి. 9 కౌంటర్లు ఏర్పాటు చేసి, వినతులు స్వీకరించారు. ఎస్పీ నేరుగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా మిషన్ సంకల్ప అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మిషన్ సంకల్ప కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సంకల్పపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాలో సంకల్ప కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మహిళలు, ఆడపిల్లలపై సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై అవగాహన కల్పించడానికి ఈ నెల 12వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కృష్ణమంజరి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ వాసంతి, అధికారిణి సుధారాణి పాల్గొన్నారు.

## బోల్తాపడ్డ కారు : తప్పిన ముప్పు



తిరుచానూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి రేణిగుంట వైపు వెళుతున్న కారు సోమవారం వేకువజామున తిరుచానూరు హరిజనవాడ వద్ద హైవే నుంచి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. మద్యం తాగి అతివేగంగా కారు నడిపినట్లు స్థానికులు చెప్పారు. డ్రైవర్ కారును అలాగే వదిలేసి వెళ్లిపోగా తిరుచానూరు పోలీసులు క్రేన్ సాయంతో వెలికితీశారు.

## రేపు, ఎల్లుండి ఆర్చరీ, స్కేటింగ్ పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈనెల 10న అండర్ 14, 17, 19 విభాగాలలో ఆర్చరీ, 11న తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలో అండర్ 11, 14, 17, 19 విభాగాలలో స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టు తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9290502041(ఆర్చరీ), 9985533560(స్కేటింగ్)లను సంప్రదించాలని కోరారు.

# సమస్యలు పరిష్కరించండి.. మహాప్రభో!

**● పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల మొర**

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'వారాలుగా తిరుగుతూనే ఉన్నాం.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.. ఇప్పటికైనా దృష్టి పెట్టండి' అంటూ పలువురు అర్జీదారులు కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లావ్యాప్తంగా ప్రజలు హాజరై సమస్యలపై అర్జీలు అందజేశారు. మొత్తం 238 అర్జీలు రాగా, అందులో భూసమస్యలపై 150 వచ్చాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిల్, వీల్‌చైర్ అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

### ఎరువుల కొరత తీర్చాలని ధర్నా



రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచులయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల పేరుతో భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందే తప్పా వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. యూరియా, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

### పించను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా



అనారోగ్యం కారణంగా రెండేళ్ల నుంచి వెన్నెముక పని చేయడంలేదు. లేచి కూర్చునే పరిస్థితి కూడా లేదు. వికలాంగ పించను కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. మీరైనా దయుంచి ఇప్పించండి.

**- రమేష్, మేదరపల్లి, ఎర్రావారిపాళెం మండలం**

### బిల్డర్ మోసం చేశాడు..న్యాయం చేయండి



అపార్టుమెంట్ నిర్మాణం కోసం మేము 15మంది తిరుపతికి చెందిన బిల్డర్ చెంచయ్యకు లక్షలాది రూపాయలు చెల్లించాం. సదరు బిల్డర్ నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌పై ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి భారీ మొత్తంలో రుణం తీసుకున్నాడు. రుణం చెల్లించకపోవడంతో అపార్ట్‌మెంట్‌పై హక్కులు మావే అని బ్యాంకు వారు కోర్టుకు వెళ్లారు. బిల్డర్‌పై చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయండి.

**- నారాయణస్వామి తదితరులు, తిరుపతి**

### పించను ఇప్పించండి



మా అబ్బాయి జశ్వంత్ అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమయ్యాడు. లేచి నిలుచుకునే పరిస్థితిలో లేడు. ప్రస్తుతం రూ.6వేలు పింఛను వస్తోంది. రూ.15వేలు ఇప్పించి ఆదుకోండి.

**- జశ్వంత్ తల్లిదండ్రులు, మద్దాలి, కోట మండలం**

### ఇళ్లు ఖాళీ చేయమంటున్నారు.. న్యాయం చేయండి



సర్వే నెంబరు 27/1లో 50ఏళ్లుగా 15 కుటుంబాలు కాపురముంటున్నాయి. ఇటీవల జాతీయ రహదారి విస్తరణ కోసం ఇళ్లు ఖాళీ చేయమని నేషనల్ హైవేవారు నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారు. పరిహారం, ఇంటి స్థలం ఇవ్వకుండా మేము ఎక్కడికి వెళ్లాలి. దయుంచి న్యాయం చేయాలని వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామ పంచాయతీ శ్రీహరికోట ఎస్సీ కాలనీవాసులు గోపి, భాస్కర్, రమేష్, యశోదమ్మ, వెంకటేష్ కలెక్టర్‌ను కోరారు.

### గౌరవ వేతనం చెల్లించాలి

ఇమాం, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలని వైసీపీ నేతలు మహ్మద్ కాసీం, ఇమ్రాన్ తదితరులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత సెప్టెంబరు నుంచి గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### దోబీఘాట్ స్థలాన్ని పరిరక్షించండి

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలో రజకుల కోసం కేటాయించిన దోబీఘాట్ స్థలం కబ్జాకు గురైందని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

# బంగారు నగల దుకాణంలో చోరీ యత్నం

**● యజమాని అప్రమత్తతో ఉడాయించిన ఇద్దరు మహిళలు**

**● ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు**



దుకాణంలో నగలను పరిశీలిస్తున్న మహిళలు



చోరీకి యత్నించిన మహిళను పట్టుకొని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం బజారువీధిలోని ఓ బంగారు నగల దుకాణంలో ఇద్దరు మహిళలు చోరీకి యత్నించారు. యాజమాని అప్రమత్తం కావడంతో పరారయ్యారు. వారిని స్థానికులు వెంబడించి ఒక మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణం బజారువీధిలో శ్రీనివాసులు అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఇద్దరు మహిళలు గొలుసులు, పట్టీలు కావాలంటూ దుకాణానికి వచ్చారు. శ్రీనివాసులు గొలుసులు, పట్టీల సెట్‌ను వారి ముందు ఉంచాడు. గొలుసులను పరిశీలిస్తున్న మహిళలు తీరును గమనించిన శ్రీనివాసులుకు అనుమానం వచ్చింది. రెండు నెలల క్రితం ఇద్దరు మహిళలు దుకాణానికి వచ్చి గొలుసులు అపహరించుకుని వెళ్లారు. అయితే నిందితులను గుర్తించక ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయాడు. సోమవారం వచ్చిన మహిళలే గతంలో గొలుసులు అపహరించుకుని వెళ్లిన ఉంటారని భావించి, వారిని అనుక్షణం పరిశీలిస్తూ అప్రమత్తంగా వ్యవహించాడు. ఇది గమనించి సదరు మహిళలు వెంటనే దుకాణం నుంచి వెళ్లిపోతూ పరుగులు తీయగా శ్రీనివాసులు వారిని వెంబడిస్తూ కేకలు వేశాడు. సమీపంలోని రాజగోపాలపురంలో స్థానికులు ఒక మహిళను పట్టుకున్నారు. ఇంతలో అక్కడకు చేరుకున్న దుకాణ యజమాని శ్రీనివాసులు సమక్షంలో పోలీసులకు అప్పగించారు. ఇంకో మహిళ తప్పించుకోవడంతో ఆమె కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా, ఈ ఇద్దరు మహిళలు సత్యవేడులోని బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడిన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టారు.

## డప్పు కళాకారులను ఆదుకోవాలి

**● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి**



డప్పు కళాకారుల సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కుమార్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : డప్పు కళాకారులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఏపీ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల డప్పు కళాకారుల సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3వేల పింఛను పెంచాలని కోరారు. కళాకారులకు భాషా సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ ప్రభుత్వపరమైన సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, మురగారెడ్డి, పి.రెడ్డెప్ప, అంజయ్య, మురళి, సహదేవయ్య, వెంకటేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ఆర్‌డీఎస్ఎస్' పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయండి



సీజీఎం జె.రమణాదేవి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని నిర్మాణాల విభాగం చీఫ్ జనరల్ మేనేజరు జె.రమణాదేవి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం అన్ని జిల్లాల నిర్మాణాల విభాగం అధికారులతో ఆమె సమీక్షించారు. గ్రామీణ ప్రాంలతాల్లో త్రీఫేజ్ లైన్లు లేని గ్రామాల్లో లైన్లు లాగి విద్యుత్ సరఫరాను మెరుగు పరిచే పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తి చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి, ప్రజలకు, కుటీర, చిన్నతరహా పరిశ్రమలకు ఉపయోగ పడుతుందన్నారు. సమావేశంలో తొమ్మిది జిల్లాల ఈఈలు, డీఈఈలు ప్రాజెక్టుల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## ఫైర్ డిటెక్షన్ హెచ్చరికతో ఆగిన హౌరా ఎక్స్‌ప్రెస్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హౌరా నుంచి తిరుచిరాపల్లికి వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సోమవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే గేటు వద్ద ఆగిపోయింది. రాత్రి 7 గంటల సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సూళ్లూరుపేట స్టేషన్ దాటి తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రైల్వేగేటు వద్దకు చేరుకోగానే రైలులో ఫైర్ సిస్టమ్ అలారం మోగింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ అత్యవసరంగా రైలు నిలిపివేశాడు. వెంటనే రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకుని బోగీలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎటువంటి సాంకేతిక లోపం లేదని నిర్ధారించిన తరువాత రైలు బయలుదేరింది. ప్రయాణికులు సిగరేట్ కాల్చి ఉంటారని, ఆ పొగకు ఫైర్ సిస్టం అలారం మోగి ఉండవచ్చునని రైల్వే సిబ్బంది అనుమానిస్తున్నారు. దాదాపు 15 నిమిషాలు రైలు ఆగిపోవడం, సిబ్బంది అన్ని బోగీల్లో తనిఖీలు చేపట్టడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

## వ్యాను ఢీకొని ఒకరి దుర్మరణం



మృతిచెందిన అమరనాథరెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని సర్వీసు రోడ్డులో వ్యాను ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన అమరనాథరెడ్డి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో శానంబట్ల నుంచి తిరుపతి వైపు వస్తున్నారు. అదేసమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వస్తున్న వ్యాను ఢీకొంది. ఈప్రమాదంలో అమరనాథరెడ్డి(31)కి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆగిన వేదపారాయణదార్ పోస్టుల భర్తీ

**● విమర్శల నేపథ్యంలో నిలుపుదలకు ఆదేశిమిచ్చిన టీటీడీ**

తిరుమల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో వేదపారాయణదార్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. కేవలం ఓ ప్రాంతవాసులకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు, ఫిర్యాదుల నేపథ్యంలో దాదాపు 700 పోస్టుల భర్తీని టీటీడీ రద్దు చేసింది. గత ప్రభుత్వానికి సానుభూతిపరుడిగా ముద్ర ఉన్న ఓ అధికారి తమిళులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ కొందరు బ్రహ్మణులు సీఎంవోతో పాటు మంత్రి లోకేశ్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 11వ తేదీన ఇంటర్వ్యూలు జరగాల్సి ఉన్న క్రమంలో ఈ పోస్టుల వ్యవహారానికి రాజకీయ, ప్రాంతీయ రంగు పులుముకుంది. దీంతో పోస్టుల భర్తీని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు విశ్వసనీయమైన సమాచారం.

## రూ.లక్షల విలువైన మందులు వృథా

**● కాలం చెల్లడంతో డిస్పోజబుల్ కేంద్రానికి తరలింపు**

డక్కిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన మందులు మట్టిపాలయ్యాయి. సకాలంలో వినియోగించుకోకపోవడంతో కాలం చెల్లిన మందులను వృథాగా పడేయాల్సి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరును స్థానికులు గుర్తించి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఈ విషయం తెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక వైద్యాధికారిణి బిందుప్రియాంకను వివరణ కోరగా.. అవి డక్కిలి ఆస్పత్రికి చెందిన మందులు కాదని, 104 ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన మందులని తెలిపారు. కాలం చెల్లిపోవడంతో రాపూరులోని డిస్పోజబుల్ కేంద్రానికి ట్రాక్టరు తీసుకెళుతుండగా కొంత మంది ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ ఆర్ఎంపీ వైద్యుడు ఈ ఘటనను తప్పుదారి పట్టించేందుకు ప్రయతిస్తున్నారని, దీనిపై విచారణ చేపడతామని డాక్టర్ బిందుప్రియాంక చెప్పారు.



డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరు